సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం, 6, అక్టోబర్, 2023



పనులకు జీవం పోసేలా..

కోడి రామ్మూర్తి స్టేడియం పనులు మొదలుకానున్నాయి. 8న ఈ పనులపై సమీక్ష నిర్వహించనున్నారు. - 8లో



ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ఆమదాలవలసలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. క్షణికావేశంలో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. - 8లో



జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు..

ఇచ్ఛాపురం: జాతీయ స్థాయి పాఠశాలల ఖోఖో క్రీడా పోటీలకు మున్సిపల్ బాలికోన్నత పాఠశాలకు చెందిన రెయ్యి తనూజ, జీన గుణవతి, రెయ్యి సరస్వతి ఎంపిక య్యారని పాఠశాల హెచ్ఎం పద్మవల్లి తెలిపారు. వీరిని గురువారం అభినందించారు.

న్యూస్‌రీల్

టెక్కలిలో అండర్-19 ఎస్‌జీఎఫ్ జిల్లా ఎంపికలు రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారుల ఎంపికలు శనివారం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీడీ ఎస్.రమణ చెప్పారు. ఉదయం 9 గంటలకు బాలబాలికలు విభాగంలో ఎంపికలు జరుగుతాయని చెప్పారు. జనవరి 1, 2005 తర్వాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, నెట్బాల్, రగ్బీ, రూప్ స్కిప్పింగ్ అంశాల్లో ఎంపికలు ఉంటాయని అన్నారు. పీడీలు ఎన్.రమేష్, వై.వి.రమణ, ఎస్.లక్ష్మణరావు, బి.నారాయణరావు, కె.కె.రామిరెడ్డి ఈ ఎంపికలు పర్యవేక్షిస్తారని తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు పరీక్ష



రాత పరీక్షను పర్యవేక్షిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి గాను సచివాలయాల్లో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లకు జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మథరావు పర్యవేక్షణలో గురువారం ఓ ప్రవేటు ఫంక్షన్ హాల్‌లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను అప్పగించేందుకు సిద్ధమవుతున్నారు. పరీక్షకు 200మంది పాల్గొన్నారు.

ఫార్మా పరిశ్రమలో ఉద్యోగాలకు శిక్షణ

రణస్థలం: ఫార్మా పరిశ్రమలో ఉద్యోగాలు పొందేందుకు ఎమ్మెస్సీ చదివిన విద్యార్థులకు ఉచితంగా నాలుగు నెలలు శిక్షణ ఇస్తున్నామని అరబిందో కార్పొరేట్ హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యూఎస్‌బీ రాజు తెలిపారు. మండలంలోని వరిసాం సమీపంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న 9వ బ్యాచ్ చెందిన 30 మంది విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎమ్మెస్సీ చదివి ఎంపికైన విద్యార్థులకు ఫార్మాస్యూటికల్ క్వాలిటీ కంట్రోల్ అనలైటికల్ టెక్నిక్స్ శిక్షణను నాలుగు నెలలు పాటు ఇచ్చినట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అధునాతన యంత్రాలతో ఫార్మా, కెమికల్స్‌కు అవసరమైన శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ రమా శ్రీనివాస్, యూనిట్ హెచ్ఆర్ హెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ కమలాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డీసీసీబీ బ్యాంకుల్లో ఈ-స్టాంపింగ్

ఇచ్ఛాపురం రూరల్: సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో భూక్రయ, విక్రయాలకు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్మును డీసీసీబీ బ్యాంకుల్లో ప్రవేశపెట్టిన ఈ-స్టాంపింగ్ ద్వారా చెల్లించేలా సౌకర్యం కల్పిస్తున్నామని సీఈఓ డి.వరప్రసాద్ అన్నారు. ఆయన గురువారం ఈదుపురం డీసీసీబీ బ్యాంకును సందర్శించారు. జిల్లాలో తమ శాఖ 2023 మార్చి నుంచి ఆరు నెలల్లో రూ.2,350 కోట్లు టార్గెట్‌కు రూ.2,045 కోట్లు బిజినెస్ సాధించిందని అన్నారు. 2023 నాటికి రూ.2,500 కోట్లు లక్ష్యంగా బిజినెస్ సాధిస్తామని తెలిపారు. పేటీఎం లింక్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను 49 సొసైటీలు, 25 బ్రాంచ్‌లలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మరో 7 నూతన డీసీసీబీ బ్రాంచ్‌లను ప్రారంభిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. అన్ని వర్గాల వారికి తమ బ్యాంకుల్లో రుణ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు.



ప్రారంభానికి ముస్తాబైన పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి

స్వప్నం సాక్షాత్కరిస్తోంది..

- చకచకా జరుగుతున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్ తుది పనులు
- ఈ నెలాఖరు నాటికి సీఎం చేతులమీదుగా ప్రారంభించే అవకాశం
- 15వ తేదీకి పనులు పూర్తి కావాలని ఆదేశాలు జారీ
- సీటీస్కాన్‌తో పాటు, రూ.15కోట్లతో అధునాతన మిషనరీలు
- సీఎంఓ కార్యాలయ ఆదేశాలతో ఏర్పాట్లు : మంత్రి అప్పలరాజు

ఏళ్లుగా రక్తాశ్రువులు చిందిస్తున్న ఉద్దానంకు ఉపశమనం లభించనుంది. కళ్లెదురుగానే కన్నబిడ్డలను కోల్పోతూ ఆ భూమి తల్లి పడుతున్న శోకానికి ఇన్నాళ్లకు ముగింపు కనిపిస్తోంది. కిడ్నీ వ్యాధి మహమ్మారి బారిన పడి జీవం కోల్పోతున్న ఊళ్లకు కొత్త ఊపిరి పోసేలా పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సిద్ధమైంది. ఇది కేవలం ఇటుక, ఇసుకల నిర్మాణం కాదు. దశాబ్దాలుగా ఉద్దానం కంటున్న కల. ఇది కేవలం వైద్యులు, వైద్య పరికరాల ఆస్పత్రి కాదు. ఈ ప్రాంతపు ఆయువు పెంచే కోవెల. ఈ నెలాఖరులోగా ప్రారంభానికి సిద్ధమవుతున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌పై శ్రీకాకుళం ఎన్నో ఆశలు పెట్టుకుంది.



కాశీబుగ్గ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఉద్దానం కోసం కిడ్నీ రీసెర్చ్‌సెంటర్ నిర్మిస్తామని జనం సాక్షిగా ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారు. పలాసలో నిర్మిస్తున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పనులు దాదాపు పూర్తయ్యాయి. కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభానికి సిద్ధమైంది. శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగానే ఈ నెలాఖరులోగా ప్రారంభించే అవకాశం ఉంది.

90 శాతం పనులు పూర్తి

పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. తొలుత రాష్ట్ర బడ్జెట్‌లో రూ.50 కోట్లు విడుదల చేసి అత్యవసర విభాగంలో పనులు ప్రారంభించారు. పనులు శరవేగంగా జరుగుతున్న సమయంలో రెండేళ్ల పాటు కరోనా కారణంగా పనులు నిలిచిపోయాయి. ఆలస్యం అయినప్పటికీ నేటికి



సిద్ధమైన ఓపీ నమోదు విభాగం

తొంభై శాతం పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది. జి+ఐదు అంతస్తులు ఉన్న ఈ భవనంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రి, ఆపరేషన్ థియేటర్‌లు, డయాలసిస్ కేంద్రాలు, మెడికల్ విద్య, అత్యవసర విభాగం, ర్యాంప్‌లు, రక్త నిల్వ కేంద్రం, ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్, నాలుగు చోట్ల ఓపీ విభాగాలు, ఆపరేషన్ థియేటర్లు, స్కానింగ్ విభాగాలు, ఐసీయూ కేంద్రాలు, అబ్జర్వేషన్ గదులు, మందులు విభాగం, మెగా డ్రగ్‌స్టోర్, లిఫ్టులు, మెట్లదారి, అత్యవసర ర్యాంప్ అన్నీ సిద్ధమయ్యాయి.

సాక్షి డెవలప్‌మెంట్ వాచ్



ఆస్పత్రికి చేరిన కోట్లాది రూపాయల మిషనరీ

అయితే సాధారణ విభాగం, అత్యవసర విభాగాలు బ్లాక్-ఎ, బ్లాక్-బి గా విడదీసి సేవలు అందించనున్నారు. రూ.39 కోట్లతో భవన నిర్మాణ పనులకు కేటాయించగా, టెక్నికల్ విభాగానికి మిగిలిన ఇతర నిధులు ఖర్చు చేశారు. అంతే కాకుండా అదనంగా సుమారు రూ.15 కోట్లు విలువైన సీటీ స్కాన్ వంటి భారీ స్థాయి మిషనరీలు, ఆపరేషన్ థియేటర్లు, అవసరమైన వస్తువులు అదనంగా సమకూర్చారు. ఇప్పటి వరకు అన్ని పనులు పూర్తవగా చివరిగా పై అంతస్తుల్లో ఉన్న సీలింగ్ పనులు, మిషనరీల అమరికలు, బయట ఉన్న సీసీ రోడ్డు, మున్సిపాలిటీ వారు చేపడుతున్న పాతజాతీయ రహదారి నుంచి ఆస్పత్రి వరకు బీటీ రోడ్డు మిగిలి ఉన్నాయి. వైఎస్సార్ విగ్రహంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం గార్డెన్ ఏర్పాటు చేయనున్నారు.

ప్రారంభ తేదీ ప్రకటిస్తాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రీతిపాత్రంగా చూసే ప్రాంతమిది. ఆయన చేతులమీదుగానే శంకుస్థాపన చేసిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమవడం సంతోషకరం. ఈ నెలలో ముఖ్యమంత్రి జిల్లాకు రానున్నారు. అయితే దీనిపై అధికారిక ఆదేశాలు వచ్చాక తేదీలు ప్రకటిస్తాం. ఇప్పటికే మేము చేయాల్సిన పనులు, ఏర్పాట్లతో మా కేడర్ అంతా నిమగ్నమై ఉన్నారు. ఉద్దానంలో కొనసాగుతున్న కిడ్నీ మరణాలను తక్షణమే ఆపాలనేది మా ప్రభుత్వ సంకల్పం. అందుకోసం నిరంతరం పాటుపడుతున్నాం. – డాక్టర్ సీదిరి అప్పలరాజు, రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి

నెలాఖరుకు ప్రారంభం..

ఈనెల 15వ తేదీకి సంపూర్ణంగా అన్ని కేటగిరీల్లో పనులు పూర్తి చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అన్నీ అనుకున్నట్టు జరిగితే అక్టోబరు 20 నుంచి 25వ తేదీల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించే అవకాశం ఉంది. శ్రీకాకుళం జిల్లా పర్యటన ఇదే నెలాఖరుకు ఉండటంతో ప్రారంభమవుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారికంగా ప్రణాళిక విడుదల కావాల్సి ఉందని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సత్య ప్రభాకర్ తెలియజేశారు.



ఆస్పత్రి ముందు డబుల్‌లైన్ సెంటర్‌లైట్‌తో సీసీ రోడ్డు



సిద్ధమవుతున్న ఆపరేషన్ థియేటర్

మరో ముప్పై ఏళ్లు వైఎస్ జగనే సీఎంగా ఉండాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: ఇచ్చిన హామీలు నెరవేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో ముప్పై ఏళ్ల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండాలని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. 'ఏపీకి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎందుకు కావాలి' అనే అంశంపై నరసన్నపేట లోని ఒక కల్యాణ మండపంలో గురువారం మండల పార్టీ కార్యకర్తలు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ **ఆపు బాబూ నీ నాటకం–జగనన్నే మా నమ్మకం** అనే నినాదం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. చంద్రబాబు పాలనకు, మన నేత వైఎస్ జగన్ పాలనకు తేడాను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ నెల 11 నుంచి సచివాలయాలు యూనిట్‌గా తీసుకొని ఇంటింటి ప్రచారం చేపట్టేందుకు కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సిద్ధం కావాలన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరవేయాలని కోరారు. వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని కోరారు.

ఈ సందర్భంగా పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య మాట్లాడుతూ రానున్న ఆరు నెలలు చాలా కీలకమన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌ను, ఎమ్మెల్యేగా ధర్మాన కృష్ణదాస్‌ను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు లుకలాపు రవి, ఎంపీపీ ఆరంగి మురళి, మండల జేసీఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బార్ల వేణుగోపాలరావు, ఉపాధ్యక్షుడు రొౌతు శంకరరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, పాట్నూరు సాయి ప్రసాద్, సీనియర్ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త లు ప్రసంగించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, పార్టీ నాయకులు రాజాపు అప్పన్నలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సోరియాసిస్ బాధితురాలికి రూ.50వేలు సాయం



సోరియాసిస్ వ్యాధితో బాధపడుతున్న జ్యోతికి చెక్ అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన బదకల జ్యోతి అనే బాలిక పుట్టినప్పటి నుంచీ సోరియాసిస్ వ్యాధితో బాధపడుతోంది. 6వ తరగతి చదువుతున్న జ్యోతి పరిస్థితిని గమనించిన జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్యను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ దృష్టికి తేవడంతో ఆయన చలించిపోయారు. వెంటనే ఆయన జ్యోతి చికిత్సకు తన నిధుల నుంచి తక్షణ సాయంగా రూ.50వేలు మంజూరు చేశారు. గురువారం ఇచ్ఛాపురంలో ఆ చెక్‌ను బాలిక జ్యోతి, తల్లి చిలకమ్మకు పిరియా విజయ అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, పిరియా సాయిరాజు, నరేష్‌కుమార్ అగర్వాలా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆర్భాటాలతోనే రాష్ట్రం అధోగతి

- మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చేసిన ఆర్భాటాలతోనే రాష్ట్రం అధోగతి పాలైందని మంత్రి అప్పలరాజు అన్నారు. మండలంలోని బుడార్సింగిలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేసిన అన్యాయాలు, అక్రమాలను ప్రజలు కళ్లారా చూశారన్నారు. వీటిని కప్పిపుచ్చుకోవడానికి ఆయన పడుతున్న పాట్లు కూడా ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. చంద్రబాబు అరెస్టుతో ప్రభుత్వానికి సంబంధం లేదని, కానీ ప్రభుత్వంపై బురద జల్లేందుకు తెలుగుదేశం నాయకులు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు వాస్తవాలను గమనించాలని కోరారు. గతంలో కొన్ని రోగాలకు దూర ప్రాంతాలకు వెళ్లేవారని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. శ్రీకాకుళం, బరంపురం(ఒడిశా), విశాఖపట్నం వైద్యానికి వెళ్లే పేదలకు ప్రస్తుతం ఈ ప్రాంతంలోనే వైద్యం అందుతోందన్నారు. గతంలో చంద్రబాబు నాయకత్వంలో నాయకులు ప్రజల సొమ్మును దోచేశారని, అందుకే రాష్ట్రం అభివృద్ధి చెందలేదన్నారు. బుడారిసింగి పంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలోనే ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సర్పంచ్ సురేష్‌కుమార్‌పాణిగ్రాహి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి దల్లి జానకిరావురెడ్డి, ఎంపీటీసీలు సీర లోకనాథం, రమేష్‌పంతులు, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, సీనియర్ న్యాయవాది యు.కృష్ణమోహన్, మందస, సిరిపురం వైద్యాధికారులు మద్దిల సంపత్‌రావు, నాగసాయి, జెమ్స్ నుంచి వైద్యులు జితేష్, శ్రీకళ, సిబ్బంది, ఈఓపీఆర్డీ కె.జయప్రకాశ్, ఎంఆర్ఐ సవర చిన్నారావు, సీడీపీఓ కె.వసుంధరాదేవి, సూపర్‌వైజర్ జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి జి.మురళీ, ఆప్తాలమిక్ సవర శ్రీకాంత్ పార్టీ నాయకులు అభిరాం, బృందావన్, ఢిల్లీ, తమిరియా శోభన్‌బాబు, బమ్మిడి ధర్మారావు, రమేష్‌పంతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత



కొరసవాడలో వైద్యులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పన కుమారి

పాతపట్నం: ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పన కుమారి అన్నారు. మండలంలోని కొరసవాడ గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు అందిస్తున్న సేవలపై రోగులతో మాట్లాడారు. రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేలా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, వైద్యులు సదాశివ, శ్రీధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





గార: వాడాడ పంచాయతీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు (ఇన్‌సెట్లో) సంతబొమ్మాళి: కె.లింగూడులో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రమాజీ మంత్రి కిల్లి కృపారాణి



తెప్పలవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలపై ఆరా తీసున్న రాష్ట్ర నోడల్ అధికారి సిద్ధార్థ జైన్, ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రణస్థలం: జగనన్న ఆరోగ్య సురక్ష ఏ మేరకు సత్ఫలితాలు ఇస్తుందో పరిశీలనకు వచ్చానని జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి, గ్రామ, వార్డు సచివాలయాల కమిషనర్ సిద్ధార్థ్ జైన్ అన్నారు. ఆయన గురువారం తెప్పలవలసలో జరిగిన కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

గురువారం ఆరోగ్య సురక్ష ఇలా..

మండలాలు	30	క్యాంపులు	32
ఓపీ	9654	రిఫరల్స్	269

నవోదయలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న మిగులు సీట్లు భర్తీ చేస్తున్నారు. ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా గోపూజలు



గోశాలలో పూజలు నిర్వహిస్తున్న ఈఓ వి.హరిసూర్యప్రకాష్, వేదపండితులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా గురువారం గోపూజలు ఘనంగా నిర్వహించారు. కొత్తగా నిర్మించిన గోశాలలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఈఓ వి.హరిసూర్యప్రకాష్ సమక్షంలో పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణలు, మంగళధ్వనుల మధ్య ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. అలాగే అంతకుముందు గురువారం ఉదయం త్రిచ,సౌర అరుణ ప్రయుక్త సూర్యనమస్కారాల పూజలు, ఉపనిషత్ పారాయణాలు, వేద పారాయణ కార్యక్రమాలు అనివేటి మండపంలో అర్చకులు జరిపించారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



రోడ్డు ప్రమాదంలో దగ్ధమవుతున్న ద్విచక్రవాహనం

టెక్కలి రూరల్: మండలంలోని చల్లపేట గ్రామ సమీప జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఒక ద్విచక్రవాహనం దగ్ధమై ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సారవకోట మండలం అక్కివలస గ్రామానికి చెందిన కె.భాస్కరరావు, బి.లక్ష్మీనారాయణ అనే ఇద్దరు వ్యక్తులు తన గ్రామం నుంచి టెక్కలి వైపు తన బైక్‌పై వస్తుండగా చల్లపేట గ్రామ సమీపంలోకి వచ్చేసరికి కుక్క అడ్డురావడంతో ఒక్కసారిగా ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడి అగ్నికీలలు ఎగసిపడ్డాయి. పెట్రోల్ ట్యాంక్‌కు అగ్గి రాజుకోవడంతో ప్రమాదం పెద్దదైంది. అయితే బండిపై ఉన్న ఇద్దరూ స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి ఎస్‌ఐ ఎల్ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

8న జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి జూనియర్స్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపికలు ఈనెల 8వ తేదీన జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టి నాగభూషణం, సీహెచ్ ఫల్గుణరావు తెలిపారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు 18 ఏళ్లలోపు వయస్సు కలిగి 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. క్రీడాకారుల వయస్సు, బరువు, ఎత్తు ఇండెంట్ ప్రకారం 250లోపు పాయింట్లను కలిగి ఉండాలని వారు పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను చిత్తూరు జిల్లాలో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు జరిగే ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల ఖోఖో చాంపియన్‌షిప్ -2023 పోటీలకు పంపిస్తామని నాగభూషణం, ఫల్గుణరావు చెప్పారు. ఆసక్తి అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో టెక్కలి జీడీసీ మైదానం వద్దకు హాజరై జిల్లా ఖోఖో సంఘ కోశాధికారి, ఫిజికల్ డైరెక్టర్ బాడాన నారాయణరావు (8500007272)ను సంప్రదించాలని వారు కోరారు.

'బీసీ కులాలు ఏకతాటిపైకి రావాలి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీసీ కులాలు అంతా ఏకతాటిపైకి రావాలని, ఐక్యంగా ఉంటే హక్కుల సాధన సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పైడి చంద్రరావు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడారు. సంఘం ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, జిల్లా గౌరవాధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి మాట్లాడుతూ బీసీ కుల గణన త్వరితగతిన నిర్వహించాలని తెలిపారు. కేంద్రం ప్రవేశ పెట్టిన మహిళా చట్టంలో ఓబీసీ మహిళలకు ఎక్కువ సీట్లు కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో కూడా ఓబీసీ మహిళా ప్రాతినిధ్యం ఉండాలన్నారు. ఈ నెల 8న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి సమావేశానికి ఎక్కువ సంఖ్యలో బీసీ కుల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో వివిధ బీసీ కులాలకు చెందిన నాయకులు సీహెచ్ సూర్యనారాయణ, కల్లూరి తిరుపతిరావు, వైశ్యరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఒంటరి మహిళపై లైంగికదాడి

గార: మండలంలోని కొర్ని గ్రామానికి చెందిన ఒంటరి మహిళపై అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడినట్టు గార ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఆ మహిళపై ఆటో డ్రైవర్ అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలిపారు. దీనిపై బాధితులకు పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఆ మేరకు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

నిలిచిన పనులకు జీవం పోసేలా..

- కోడి రామ్మూర్తి స్టేడియం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి
- ఈ నెల 8న క్రీడాసంఘాలతో మంత్రి ధర్మాన సమావేశం
- క్రీడాసంఘాలు, పీడీలతోసహా క్రీడావర్గాలంతా హాజరుకావాలని ఒలింపిక్ సంఘం సూచన

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా కేంద్రంలో అర్ధంతరంగా నిలిచిపోయిన కోడి రామ్మూర్తి స్టేడియం పనుల పునఃప్రారంభంపై ప్రభుత్వం దృష్టిసారించింది. సాధ్యమైనంత వేగంగా పనులు పూర్తి చేయాలని భావిస్తోంది. కేఆర్ స్టేడియం ఆధునికీకరణ, మిగిలిన పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఈనెల 4వ తేదీన రూ.12 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. గత పాలకుల శాపం, పార్టీ అనుబంధ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, నాటి క్రీడల మంత్రిగా అచ్చెన్నాయుడు కమిషన్ల రగడ తదితర కారణాలతో కోడిరామ్మూర్తి స్టేడియం పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. దీంతో దాదాపు దశాబ్ద కాలంగా క్రీడాకారులు నానా అగచాట్లు, అష్టకష్టాలు పడ్డారు. ప్రత్యామ్నాయంగా అందుబాటులో ఉన్న మైదానాల్లో నామమాత్రపు సాధనకే పరిమితమయ్యారు.



కోడి రామ్మూర్తి స్టేడియం భవనం, ప్రాంగణం

8న క్రీడావర్గాలతో సమీక్ష..

క్రీడాకారుల కష్టాలకు త్వరితగతిన చరమ గీతం పాడేందుకు స్వయంగా రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావు రంగంలోకి దిగుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో కేఆర్ స్టేడియం ఆధునికీకరణ, అభివృద్ధి పనులపై సమీక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులకు ఒక వర్తమానం చేరవేశారు. ఈనెల 8వ తేదీన ఉదయం 7 గంటలకు కోడి రామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలోనే అన్ని క్రీడావర్గాలు, క్రీడాసంఘాలతో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటుచేయాలని సూచించారు.

స్వచ్ఛందంగా హాజరుకావాలి

సమీక్ష సమావేశానికి క్రీడావర్గాలంతా స్వచ్ఛందంగా హాజరుకావాలని ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన శ్రీకాకుళంలో మాట్లాడుతూ ఈ సమీక్ష సమావేశంలో క్రీడాప్రాధికార సంస్థ అధికారులతోపాటు ఒలింపిక్ సంఘ ప్రతినిధులు, వివిధ క్రీడాసంఘాల బాధ్యులు, క్రీడాభిమానులు, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, క్రీడాప్రోత్సాహకులు ఇలా ప్రతిఒక్కరూ ఆదివారం ఉదయం 7 గంటలకు కేఆర్ స్టేడియం వద్దకు రావాలని ఆయన కోరారు.

క్రీడా వర్గాల నుంచి తగిన అభిప్రాయాలను, సూచనలను మంత్రి పరిగణనలోకి తీసుకుని తదుపరి చేపట్టబోయే చర్యలపై నిర్ణయం తీసుకుంటారని సాంబమూర్తి పేర్కొన్నారు. సమావేశానికి ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సైతం హాజరవుతారని ఆయన వెల్లడించారు.

'సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'



కలెక్టర్‌ను కలిసిన సచివాలయం ఉద్యోగులు సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సచివాలయం ఉద్యోగులందరికీ 2023 జూలై 1 తేదీ నుంచి వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయ, అనుబంధ ఉద్యోగులకు బదిలీలు చేయాలన్నారు. పెన్షన్ విత్‌డ్రా చేసే సమయంలో వెల్ఫేర్లకు తోడుగా ఇంకొక ఉద్యోగిని ఇవ్వాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సచివాలయ ఉద్యోగుల పనితీరు బాగుందని ప్రస్తావిస్తూ, నాలుగేళ్ల సర్వీసును అందించిన సందర్భంగా ఈ ఉద్యోగులను అభినందించారు. కలెక్టరును కలిసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ, జిల్లా సభ్యులు సంతోష్ గారు, నందిగామ మండల ప్రెసిడెంట్ తిరుపతి, టౌన్ సెక్రటరీ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బెదిరింపులకు దిగుతున్నారు'



ఫిర్యాదు చేస్తున్న యువకులు

గార: అంపోలు గ్రామానికి చెందిన ముద్దాడ గుణేశ్వరరావు, కుటుంబ సభ్యులు తమను బెదిరిస్తున్నారని పలువురు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అంపోలుకు చెందిన ముద్దాడ రాంప్రసాద్ విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి వివిధ రాష్ట్రాలకు చెందిన 29 మంది నిరుద్యోగుల వద్ద నుంచి సుమారు రూ.75 లక్షలు వసూలు చేశాడు. వీరిలో కొందరిని అజర్‌బైజాన్ దేశంలో శిక్షణ పేరిట ఉంచి తర్వాత మోసం చేశాడు. దీనిపై ఆ దేశంలో ఫిర్యాదు చేయగా కేసు నమోదై ప్రస్తుతం జైల్లో ఉన్నాడు. రామ్‌ప్రసాద్ ఆయన భార్య, తండ్రి ఖాతాల్లోకి డబ్బులు పంపించారు. ఇదిలా ఉండగా ఈ అంశంలో గతంలో గారలో కేసు నమోదైంది. అందరి డబ్బులు చెల్లిస్తామని చెప్పి నలుగురికి మాత్రమే డబ్బులిచ్చి సంతకాలు తీసుకోవడంతో మిగిలిన యువకులు వ్యతిరేకించారు. ఈ పరిస్థితుల్లో గుణేశ్వరరావుతో పాటు ముద్దాడ రమేష్‌లు బెదిరింపులు చేస్తున్నారని కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామపెద్ద మూర్తితో పాటు కొందరు యువకులు కూడా గురువారం ఫిర్యాదు చేశారని సీఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు.

ప్రశాంతంగా అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్‌కమార్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

టెక్కలి: డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి గురువారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. టెక్కలి, కోటబొమ్మాళి, సారవకోట, పాతపట్నం, కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు అంగన్‌వాడీ కార్యకర్తలు, 11 ఆయా, 1 మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు సంబంధించి మొత్తం 27 దరఖాస్తులు అందాయి. సబ్ కలెక్టర్ నూరుల్ కమార్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డి.ప్రసాదరావు, ప్రాజెక్టు అధికారులు శోభారాణి, హైమావతి, కామాక్షి, విమలారాణి, విమలాకుమారి తదితరులు పర్యవేక్షించారు.

26న వెలమ గర్జన



సమావేశంలో మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశాఖ వేదికగా నవంబర్ 26న వెలమల హక్కుల సాధన కోసం 'వెలమ గర్జన' నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు మన్మధరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వెలమ సామాజిక వర్గాన్ని బీసీ-డి నుంచి బీసీ-ఎలోకి గాని, ఎంబీసీలోకి గానీ మార్చాలని డిమాండ్ చేశారు. వెలమ సామాజిక వర్గానికి అన్ని జిల్లాలో సామాజిక భవన నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి గొల్లు శ్రీనివాస్, శ్రీకాకుళం ఇన్‌చార్జి వి.దుర్గారావు, యలమంచిలి ఇన్‌చార్జి గొర్లి రాము, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: సహిత విద్య కేంద్రాల్లో రిసోర్స్ పర్సన్ల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల (సర్టిఫికెట్ల) పరిశీలన ప్రక్రియ ముగిసింది. వీఐ/హెచ్‌ఐ, ఎంఆర్ ఈ రెండు కేటగిరీల పోస్టులకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 172 మంది దరఖాస్తులు చేసుకోగా.. సర్టిఫికెట్ల పరిశీలనకు 143 మంది హాజరయ్యారు. హాజరైనవారిలో ఆరుగురు అభ్యర్థులను ఈ పోస్టులకు దరఖాస్తు చేసేందుకు అనర్హులుగా గుర్తించారు. దీంతో మిగిలిన 137 మంది అర్హులైన అభ్యర్థుల డేటాను కేటాయించిన మార్కులు, రోస్టర్ ప్రాతిపదికన మెరిట్‌లిస్టును తయారుచేశారు. మొత్తం 17 పోస్టులు ఉన్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన సహిత విద్య కేంద్రాల్లో రిసోర్స్ పర్సన్ల సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం సిద్ధంచేసిన మెరిట్ లిస్టును సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ కార్యాలయానికి చేరవేసినట్టు సమగ్రశిక్షజిల్లా ప్రాజెక్ట్ ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం సాయంత్రం ఆయన కార్యాలయంలో తెలియజేశారు. జాబితాలపై అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు.

నవ్య మృతిపై అనుమానాలు



పంచనామా నిర్వహిస్తున్న తహసీల్దార్ సింహాచలం తదితరులు

నరసన్నపేట: స్థానిక మారుతీ నగర్-1వ వీధిలో పొడుగు నవ్య మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం రాత్రి ఆమె అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతురాలి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్‌ఐ వై.సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు డీఎస్పీ బాలచంద్రారెడ్డి గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మృతురాలి బంధువులు, భర్త సంతోష్, అత్త హేమలతతో మాట్లాడారు. అయితే తమ కుమార్తెను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారని నవ్య తల్లిదండ్రులు, అన్నదమ్ములు, ఇతర కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. భర్త సంతోష్ మాత్రం తమకేమీ తెలియదని అంటున్నారు. ఈ దశలో పోస్టుమార్టం రిపోర్టు కీలకంగా మారింది. ముందుగా చంపేసి ఆత్మహత్యగా సృష్టించేందుకు ఒంటిపై కిరోసిన్ పోసి కాల్చేశారని నవ్య కుటుంబ సభ్యులు అంటున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకూ స్థానికులతో కలివిడిగా ఉన్న అమ్మాయి అక్కడికి కొన్ని గంటల వ్యవధిలో మసి బొగ్గుగా మారి శవమైందని వారు కన్నీరు మున్నీరవుతున్నారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోస్టుమార్టం రిపోర్టు వస్తే నవ్య ఎలా మరణించిందనేది తెలుస్తుందని ఎస్‌ఐ సింహాచలం తెలిపారు. వరకట్న వేధింపుల కింద కేసు నమోదు కావడంతో నరసన్నపేట తహసీల్దార్ ఎ.సింహాచలం తదితరులు సమక్షంలో పంచనామా నిర్వహించారు.

ఫిబ్రవరి నుంచి కొత్త కలెక్టరేట్‌లో పాలన

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



కొత్త కలెక్టరేట్ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి పాలనా వ్యవహారాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఆయన గురువారం ఉదయం ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కొత్త కలెక్టరేట్‌ను పరిశీలించారు. కాంప్లెక్స్ నిర్మాణం తుది దశలో ఉందని, సివిల్ పనులు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. గత నెలలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ స్వయంగా పర్యటించారని, అలాగే జిల్లా మంత్రుల చొరవతో దాదాపు రూ.7.5 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లింపులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ పర్యవేక్షణలో పనిచేస్తున్న కాంట్రాక్టు సంస్థ ఈ డిసెంబరు నాటికి కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు తుది రూపునకు తెస్తామని హామీ ఇచ్చిందన్నారు. డిసెంబర్ నాటికి గ్రౌండ్ ఫ్లోర్, ఫిబ్రవరి నాటికి మొత్తం భవనం అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారని అన్నారు. ఏడెనిమిది దశాబ్దాల చరిత్ర కలిగిన పాత కలెక్టరేట్ స్థానే ఇప్పుడు జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త జిల్లాగా అవతరించిన శ్రీకాకుళం జిల్లాలో అన్ని శాఖలు ఒకే చోటకు వచ్చినట్లవుతుందని కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు.

ప్రతి వారం సమీక్షిస్తా

అంతకు ముందు కలెక్టర్ నూతన కలెక్టరేట్‌లోని పలు బ్లాకులను సందర్శించారు. ఇకపై ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. పనులు అత్యంత నాణ్యతా ప్రమాణాలతో వేగంగా జరపాలని కాంట్రాక్టు సంస్థకు చెప్పారు. సెంట్రలైజ్ ఏసీ, మరుగుదొడ్ల నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాల గురించి పలు సూచనలు చేశారు. ఆయా డిపార్ట్‌మెంట్లకు వేర్వేరు కరెంటు మీటర్లను అమర్చాలని సూచించారు. నాగావళి నదికి కలెక్టరేట్‌కు మధ్యలో కాంక్రీటు ఫ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలన్నారు. పచ్చదనానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రధాన పోర్టికోకు రహదారి అనుసంధానం పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ ముందు భాగంలో ల్యాండ్ స్కేపింగ్ చేసి, వంద మీటర్ల ఎత్తయిన పోల్ ఏర్పాటు చేసి, జాతీయ జెండా ఎగిరేలా తీర్చిదిద్దాలని సూచించారు. కలెక్టరేట్ లోపలి గోడలపై జిల్లా గొప్పదనాన్ని తెలిపేలా పెయింటింగ్స్ వేయించాలన్నారు. 200 మందికి సరిపడేలా పెద్ద సమావేశ మందిర నిర్మాణం రానున్న రెండు నెలల్లోపే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు రహదారులు భవనాల శాఖ ఎస్‌ఈ సుధాకర్, ఈఈ రవినాయక్, డీఈ సాగర్, ఎఈ పి.టి.రాజు, సైట్ ఇన్‌చార్జి ప్రసాద్ చౌదరి తదితరులున్నారు.

హిట్ అండ్ రన్ కేసులపై ప్రత్యేక దృష్టి



స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : హిట్ అండ్ రన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ జీఆర్ రాధిక ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావును ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. ఇందులో భాగంగా ఆమె ముందుగా పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పలు ముఖ్యమైన రికార్డులను పరిశీలించారు. శ్రీకాకుళం నగర కేంద్రంగా ఉన్న ట్రాఫిక్ పాయింట్స్‌పై ఆరా తీసి మరిన్ని పాయింట్లు పెంచి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ హిట్ అండ్ రన్ వాహనాలు గుర్తించేందుకు అవసరమైన సీసీ కెమెరాలను ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు వేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక దృష్టి పెట్టి కేసులు నమోదు చేయాలని, దర్యాప్తు పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసునూ పరిష్కరించాలన్నారు. స్టేషన్ ఆవరణలో ఎస్పీ కలియ తిరుగుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట ఎస్‌ఐ రమణ, సీసీ శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

నకిలీ వస్తువులు చూపి బంగారం చోరీ



సీసీ ఫుటేజీలో అనుమానిత మహిళలు

నరసన్నపేట: స్థానిక స్వర్ణా ప్యాలెస్ బంగారం షాపులో ఇద్దరు మహిళలు సినీ ఫక్కీలో షాపు నిర్వాహకులకు టోపీ వేసి 73 గ్రాముల బంగారు ఆభరణాలను కాజేశారు. ఈ మేరకు షాపు యజమాని బుధవారం నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 30న పుసుపులేటి గౌరీ అనే మహిళ మరో వ్యక్తితో కలసి వచ్చి కొన్ని బంగారు ఆభరణాలు అమ్మజూపారు. వీటిని పరిశీలించిన షాపు సిబ్బంది అవి బంగారు ఆభరణాలుగా భావించి ఆ ఆభరణాలకు బదులుగా వారు ఎంపిక చేసిన ఆభరణాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈలోగా మహిళలు టెస్టింగ్ కోసం ఇచ్చిన వస్తువులు మార్చి నకిలీ ఆభరణాలు వారికి ఇచ్చేశారు. వీటికి బదులుగా వారు ఎంచుకున్న 73 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకొని చెక్కేశారు. అనంతరం షాపు సిబ్బంది మరుసటి రోజు మహిళలు ఇచ్చిన వస్తువులు మళ్లీ టెస్టింగ్ చేయగా అవి పూర్తిగా నకిలీవని తెలియడంతో లబోదిబోమన్నారు. వెంటనే షాపులో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు జిల్లా వ్యాప్తంగా ఉన్న బంగారం షాపు యజమానులను అప్రమత్తం చేశారు.

86 నర్సు పోస్టులకు 9,100 దరఖాస్తులు

మహారాణిపేట: స్టాఫ్ నర్సు పోస్టుల దరఖాస్తు గడువు గురువారంతో ముగిసింది. రాష్ట్రంలో 434 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా.. జోన్-1 పరిధిలో మొత్తం 86 నర్సు పోస్టుల కోసం గత నెల 20 నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జోన్-1 పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 9,100 మంది దరఖాస్తు చేసుకున్నారు. త్వరలోనే అర్హుల జాబితాను విడుదల చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమా సుందరి వెల్లడించారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి



మృతుడు కరని శ్రీరామమూర్తి (ఫైల్)

కంచిలి: కంచిలి ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కరని శ్రీరామమూర్తి(48) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన గురుకులంలో పనిచేస్తూ, ప్రతి రోజు కంచిలి హైవేలో ఉన్న పబ్లి దాబాలో సాయంత్రం టిఫిన్ తినడానికి వెళ్తుంటారు. ఎప్పటిలాగే తన స్కూటీలో బుధవారం సాయంత్రం చీకటి పడిన తర్వాత హోటల్‌కు వెళ్లారు. దారిలో వాహనం అదుపు తప్పడంతో ఆయన రోడ్డు మీద పడిపోయారు. ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో 108 అంబులెన్స్‌లో సోంపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన స్వగ్రామం వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు గ్రామం. ఈయన కుటుంబం ప్రస్తుతం శ్రీకాకుళంలో నివాసం ఉంటున్నారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే హుటాహుటిన కంచిలి వచ్చారు. మృతుని భార్య సరిత ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ ఎస్. బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



పవన్ కల్యాణ్ (ఫైల్)

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ గ్రూప్‌లో చదువుతున్న బాడాపు పవన్‌కల్యాణ్ (16) బుధవారం అర్ధరాత్రి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సరుబుజ్జిలి మండలం అలమాజీపేట గ్రామానికి చెందిన బి.సూర్యనారాయణ కుటుంబంతో ఆమదాలవలస పట్టణంలోని పూజారిపేట సమీపంలో నివాసం ఉంటున్నారు. ఆయన వంటలు చేసేందుకు వెళ్తుంటారు. పవన్ కల్యాణ్ ఆమదాలవలస పట్టణంలో జరిగిన వినాయక చవితి నిమజ్జన ఉత్సవాల్లో కాసేపు పాల్గొని ఇంటికి వెళ్లాడు. మళ్లీ తిరిగి ఉత్సవాల్లో డ్యాన్స్‌లు చేసేందుకు వెళ్తానని తన తల్లి దమయంతి అడిగాడని ఆమె డ్యాన్స్‌లకు వెళ్లకుండా చదువుకోమని మందలించిందని స్థానికులు చెబుతున్నారు. ఈ విద్యార్థికి డ్యాన్స్ అంటే ఇష్టం, అయితే తల్లి చదువుకోవాలని చెప్పేవారు. ఎప్పటిలాగే తల్లి మందలించగా విద్యార్థి చిన్న మనసు చేసుకొని ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందినట్లు స్థానికుల కథనం. విద్యార్థి తండ్రి బుధవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో బయట నుంచి వచ్చి చూసేసరికి కుమారుడు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో కన్నీరు మున్నీరయ్యారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు అవలేదని పోలీసులు తెలిపారు. విద్యార్థి మృతి విషయం తెలిసి జీజే కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం ప్రకటించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



కామరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్

పాతపట్నం: మండలంలోని సింగుపురం గ్రామానికి ఆనుకొని ఉన్న పెద్ద చెరువులో కాకినాడ జిల్లా కిల్లంపూడి గ్రామానికి చెందిన యనమల కామరాజు(36) పడి గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ తెలిపారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా, కిల్లంపూడి గ్రామానికి చెందిన యనమల కామరాజు 20 రోజుల కిందట తోటి గ్రామస్తులతో, సింగుపురం గ్రామంలో నూతనంగా శివాలయం నిర్మాణానికి వచ్చారు. వారితో ప్రతి రోజూ శివాలయం పనులు చేసుకుంటున్నాడు. ఈ నెల 4వ తేదీన చెరువుకు బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. ఆ రాత్రి కామరాజు రాకపోవడంతో తోటి పనివాళ్లు వెతకటం ప్రారంభించారు. స్థానికులు చెరువులో మృతదేహాన్ని చూసి అది కామరాజుదేనని గుర్తు పట్టి పోలీసులకు, కుటుంబసభ్యులకు విషయాన్ని తెలియజేశారు. ఎస్‌ఐ, పోలీసులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహానికి పాతపట్నం సీహెచ్‌సీలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య దేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.